క్లుప్తంగా

విశ్వనాథునికి రుద్రాభిషేకం



ప్రత్యేకాలంకరణలో విశ్వనాథస్వామి

మనుబోలు : మనుబోలు, చెర్లోపల్లి రైల్వేగేటు సమీపంలో ఉన్న విశ్వనాథస్వామి ఆలయంలో స్వామివారికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకాన్ని సోమవారం రాత్రి నిర్వహించారు. అర్చకుడు శ్రీనివాసులు విశ్వనాథస్వామికి ప్రత్యేక పుష్పాలంకరణ చేసి విశేష పూజలు జరిపించి భక్తులకు తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు. దివంగత బొమ్మిరెడ్డి అభిలాష్‌రెడ్డి జ్ఞాపకార్థం ఆయన సతీమణి యువరాణి కుమారుడు భవదీప్ ఉభయకర్తగా వ్యవహరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

నేడు అభయాంజనేయ స్వామికి ఉత్సవం

పొదలకూరు : పట్టణంలోని మారుతీనగర్‌లో ఉన్న వీర అభయాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం విశేష పూజలు ఉంటాయని ఆలయ నిర్వాహకులు సోమవారం తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా నాలుగో మంగళవారం రెడ్డి జనసేవా సంఘం వారి ఆధ్వర్యంలో స్వామివారికి ఉదయం 5 గంటలకు అభిషేకం, 8 గంటలకు ఆకు పూజ, తీర్థప్రసాద వినియోగం ఉంటాయన్నారు. మధ్యాహ్నం 12 గంటలకు అన్నప్రసాద వితరణ, సాయంత్రం 7 గంటలకు స్వామివారి గ్రామోత్సవం, చెక్కభజన, కోలాటం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు.

వైభవంగా కుంభాభిషేక మహోత్సవాలు ప్రారంభం

నెల్లూరు(బృందావనం): వేదాయపాళెంలోని అయ్యప్పస్వామి దేవస్థానం ప్రాంగణంలో ఉన్న మహాలక్ష్మి,గోదా సమేత గురువాయూరు మహావిష్ణు మందిరంలో పుష్కర మహాసంప్రోక్షణ కుంభాభిషేక మహోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు ఉదయం పుణ్యాహవాచనం, పంచగవ్య ప్రోక్షణ, రక్షాబంధనం, మూలమూర్తికి అష్టోత్తర శతకలశాభిషేకం, ద్వారతోరణం, మహాకుంభారాధన, మండల ప్రతిష్ఠ ఆరాధన, చతుష్కుండాలతో హోమాలు, పూర్ణాహుతి, మంగళహారతి, శాత్తుమొరై, తదితర పూజాకార్యక్రమాలను కేరళ సంప్రదాయంగా శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. సాయంత్రం ద్వారతోరణ,చక్రాబ్జ, మహాకుంభారాధన, చతుష్కుండములతో హోమాలు, నివేదన, శాత్తుమొరై, తీర్థప్రసాదగోష్టి నిర్వహించారు. స్వామి అయ్యప్ప సేవా సమాజం నిర్వాహకులు గూడల శేషగిరిరావు, వెంకటరత్నం, రత్నయ్య, మోహన్‌రావు, శంకరన్ తదితరులు పర్యవేక్షించారు.

ప్రజాసమస్యలను సత్వరమే పరిష్కరించండి



ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న కమిషనర్ వికాస్‌మర్మత్

నెల్లూరు(బారకాసు): రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికను కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ విభాగ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించారు. కమిషనర్ వికాస్ మర్మత్ పాల్గొని ప్రజల నుంచి వినతి పత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎన్నికల అనంతరం తొలిసారిగా ప్రజా వేదికను నిర్వహిస్తున్నామని తెలిపారు. మౌళిక సదుపాయాల కల్పన, స్థలాలు, కాలువలపైన ఆక్రమణలు, జగనన్న కాలనీ, టిడ్కో గృహాల కేటాయింపు, కచ్చా కాలువలు, డ్రైనేజీ సౌకర్యాలు, మంచినీటి కల్వర్టులు, నూతన రోడ్ల నిర్మాణం, ప్యాచ్‌వర్క్ పనులు వంటి అంశాలపై ప్రజావేదికలో అందుకున్న సమస్యలకు సత్వరమే పరిష్కారం చూపాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వర్షాకాలపు సమస్యలను అధిగమించేందుకు అవసరమైన ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు.

మొత్తం 30 అర్జీలు

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు మొత్తం 30 వినతులు అందాయి. అందులో విభాగాల వారీగా రెవెన్యూ 1, ఇంజినీరింగ్ 6, టౌన్‌ప్లానింగ్ 9, హౌసింగ్ 5, పబ్లిక్ హెల్త్ 1, అకౌంట్స్ 6, ఆప్కాస్ 2 చొప్పున అర్జీలు వచ్చాయి. అందుకున్న వినతులు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని కమిషనర్ సంబంధిత విభాగాల అధికారులకు సూచించారు. ఇంజినీరింగ్ విభాగం ఎస్ఈ సంపత్‌కుమార్, హెల్త్‌ఆఫీసర్ డాక్టర్ వెంకటరమణ, సిటీప్లానర్ దేవీకుమారితో పాటు ఇతర అన్ని విభాగాల అధికారులు, సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

ఆరోగ్య నిధి.. అల్లనేరేడు

- దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారికి దివ్య ఔషధం
- రోగనిరోధక శక్తి పెంపు



అల్లనేరేడు చెట్టు

కోవూరు : ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలంటే ప్రకృతి సిద్ధంగా లభించే పండ్లు, కూరగాయలను సీజన్ల వారీగా తినాల్సిందే. అందులోనూ అల్లనేరేడు పండ్లు ఆరోగ్యానికి ఎంతో మేలు చేకూరుస్తుంది. ఇది శరీరంలో ఏర్పడే అనేక రుగ్మతలను దూరం చేసి శరీరానికి చలువ చేస్తాయి. రుచిలో మేటిగా ఉండే నేరేడు పండు మాత్రమే కాకుండా చెట్టు ఆకులు, బెరడు కూడా శరీరానికి ఎంతో మేలు చేస్తాయి. ఈ పండ్లు చూసేందుకు నల్లగా నిగనిగలాడుతాయి. తింటే వగరు, తీపి, పుల్లగా ఉంటాయి. మధుమేహం, గుండె సంబంధ వ్యాధులు, కాలానుగుణంగా వచ్చే వ్యాధులను అరికట్టడంలో ఎంతో కీలకంగా ఉంటాయి.

కేజీ రూ.150 నుంచి..

నేరేడు పండ్లను కోయడం శ్రమతో కూడుకున్న పని. అల్లనేరేడు కేజీ రూ.150 నుంచి రూ.200 వరకు పలుకుతోంది. అందులో నాణ్యమైన నేరేడు పండ్లను వేరు చేసి ఇంకా లాభసాటి ధరకు విక్రయిస్తారు. సంప్రదాయ ఆయుర్వేద వైద్య విధానం పరంగా అనేక ఔషధ లక్షణాలు కలిగి ఉన్న నేరేడుకు అత్యంత ప్రాముఖ్యత ఉంది. ప్రస్తుత సీజన్‌లో రోజుకు ఒక్కటి చొప్పున నేరేడు పండు తింటే వ్యాధులు దూరమవుతాయని వైద్యులు చెబుతున్నారు. వర్షాకాలం ప్రారంభ సమయంలో మాత్రమే అరుదుగా దొరికే అల్లనేరేడును తరచుగా తింటే రోగ నిరోధకశక్తి పెరుగుతుంది. ఇవి మూత్ర సమస్యల నియంత్రణతో పాటు మధుమేహం అదుపులో ఉంటుంది. కిడ్నీలను శుభ్రపరుస్తాయి. మూత్రాశయంలో ఇన్ఫెక్షన్లను తగ్గిస్తాయి. కాలేయాన్ని శుభ్రపరిచి పనితీరును మెరుగుపరుస్తుంది. వీటిలోని యాంటీ ఆక్సిడెంట్లు, గుండె, మెదడుకు దివ్య ఔషధంగా పనిచేస్తాయి. దంతాలు, చిగుళ్ల ఆరోగ్యకరంగా ఉంటాయి. చిగుళ్ల నుంచి రక్తస్రావం తగ్గుతుంది. నోట్లోని చెడు బ్యాక్టీరియా నశించి దుర్వాసన రాకుండా చేస్తుంది. కడుపులో పేరుకుపోయిన మలినాలను బయటకు పోవడానికి నేరేడు పండు దోహదపడుతుంది. అల్లనేరేడు పండ్లలో విటమిన్లు, ఖనిజ లవణాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరంలో అనేక రుగ్మతలను నివారిస్తాయి. అల్లనేరేడు పండ్లలో ఔషధ గుణాలు మెండుగా ఉంటాయి. సంపూర్ణ ఆరోగ్యానికి నేరేడు పండు భరోసా కల్పిస్తుంది. ఈ పండ్లకు ప్రస్తుతం మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. అందుకే నేరేడు పండ్లను ప్రజలు విరివిగా కొనుగోలు చేస్తున్నారు. మండల కేంద్రంలోని పండ్ల దుకాణాల వద్ద, బండ్లపై నేరేడు పండ్లను విక్రయిస్తున్నారు.



అల్లనేరేడు పండ్లు

ఆరోగ్యానికి ఎంతో మేలు

అల్లనేరేడు పండు శరీరానికి ఎంతో మంచిది. వీటితో ఎన్నో ఉపయోగాలు ఉన్నాయి. పలు రకాల వ్యాధుల నివారణకు ఈ పండు ఎంతగానో దోహదపడుతుంది. వీటిని నానబెట్టి తీసుకుంటే అజీర్తి, అతిసార, కలరా వ్యాధులు తగ్గుతాయి. కాలానుగుణంగా వచ్చే పండ్లను తింటుండాలి. ఇందులోని ఔషధ గుణాలతో ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు చేకూరుతాయి. చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరూ తినవచ్చు.

– వెంకటచలపతి, వైద్యాధికారి, కోవూరు

రక్తదానంతో మరొకరికి ప్రాణదానం



రక్తదాన కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న సీఈఓ జీజేరావు



రక్తదాతకు సర్టిఫికెట్ల అందజేత

- పోర్టు సీఈఓ జీజే రావు

ముత్తుకూరు : రక్తదానం చేయడం ద్వారా ప్రాణదా నం చేయవచ్చని అదాని కృష్ణపట్నం పోర్టు సీఈఓ జీ జే రావు అన్నారు. రెడ్‌క్రాస్ సహకారంతో పోర్టులో సో మవారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయ న ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ర క్తం చాలా విలువైనదని, ధనంతో కొనలేనిదని పేర్కొ న్నా రు. ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేసి, ఆదుకోవడం మానవత్వమని చెప్పారు. రక్తదానం చేసి విలువైన ప్రాణాలు రక్షించడమే కాకుండా ఒక కుటుంబాన్ని ఆదుకున్నామన్న సంతృప్తి లభిస్తుందన్నారు. ఈ శిబిరంలో రక్తదానం చేసిన 283 మందికి ఆయన సర్టిఫికెట్లు అందజేశారు. సీఓఓ రాజన్‌బాబు, అడ్మిన్‌హెడ్ గణేష్‌శర్మ, ఈహెచ్ఎస్ ఏజీఎం వేణుగోపాలరెడ్డి, సెక్యూరిటీ హెడ్ వెంకటేష్‌భాస్కరన్, మనీష్‌దావే, మృత్యుంజయరామ్, గుడివాడ శ్రీకాంత్ పాల్గొన్నారు.

మామిడిపూడిలో ఉపాధి పనులు

ముత్తుకూరు : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మండలంలోని మామిడిపూడిలో ఉన్న ఎల్లవకాలువలో పూడికతీత పనులను సోమవారం చేపట్టారు. ఈ క్రమంలో స్థానిక పేదలకు ఉపాధి కల్పించారు. ఇందులో భాగంగా తురుగోడిగుంట బ్రిడ్జి నుంచి వజ్రావతమ్మ పొలం వరకు 1,500 మీటర్ల పొడవు, 10 మీటర్ల వెడల్పున ఎల్లవ కాలువ పూడిక తీశారు. ఈ పని ద్వారా 61 మందికి ఉపాధి కల్పించారు. రూ.2.45 లక్షల అంచనాలతో పని చేపట్టారు. ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ వీరాస్వామి ఆధ్వర్యంలో పనులు జరిగింది.



ఎల్లవకాలువలో పూడిక తీస్తున్న కూలీలు

ఆలయ భూములకు కౌలు వేలం

తోటపల్లిగూడూరు : నెల్లూరు నవాబుపేటలో కొలువుదీరిన సీతారామాంజనేయస్వామి ఆలయ భూముల కౌలు వేలంపాటలు సోమవారం ప్రశాంతంగా జరిగింది. ఈ ఆలయానికి సంబంధించి మండలంలోని చింతోపు పంచాయతీ పరిధిలో 7.99 ఎకరాల మాగాణి భూమి ఉంది. ఈ భూములకు సంబంధించి 2024–27 మధ్య కాలంలో మూడేళ్ల కాలపరిమితికి సోమవారం చింతోపులోని ఆంజనేయస్వామి ఆలయంలో దేవదాయశాఖాధికారులు కౌలు వేలం పాటలు నిర్వహించారు. స్థానిక రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కాగా కొత్తూరుకు చెందిన లేబూరు వెంకురెడ్డి అనే రైతు ఏడాది కాలానికి రూ.3,46,100లకు హెచ్చుపాట ద్వారా మూడేళ్లకు ఆలయ భూములను దక్కించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ కవిత, స్థానిక గ్రామ పెద్దలు కై లాశం ఆదిశేషారెడ్డి, నెట్రంబాకు శ్రీనువాసులు తదితరులు పాల్గొన్నారు.



వేలంపాట నిర్వహిస్తున్న అధికారులు

యథేచ్ఛగా మట్టి అక్రమ తరలింపు

- గొలగమూడిలో టీడీపీ నేతల బరితెగింపు

వెంకటాచలం : మండలంలోని గొలగమూడి గ్రామంలో ఉన్న పడమటి చెరువు నుంచి గత నాలుగు రోజులుగా టీడీపీ నాయకులు ట్రాక్టర్లతో లేఅవుట్లకు యథేచ్ఛగా మట్టి తరలిస్తూ, సొమ్ము చేసుకుంటున్నారు. స్థానికంగా ఉన్న లేఅవుట్లకు ఎలాంటి అనుమతులు లేకుండానే టీడీపీ నాయకులు మట్టి తరలిస్తున్నారు. మట్టి అక్రమ తవ్వకాలపై గ్రామస్తులు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదు. ఇరిగేషన్ శాఖ, పోలీసు శాఖ అధికారులు జోక్యం చేసుకుని మట్టి అక్రమ తరలింపును అడ్డుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు



పడమటి చెరువు నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్లు

టీడీపీ నేతల ఆగడాలను అడ్డుకోవాలి

- కలెక్టర్‌కు దళిత సర్పంచ్ ఫిర్యాదు

కోవూరు : టీడీపీ నేతల ఆగడాలు అధికమయ్యాయని, ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని వారికి అడ్డుకట్ట వేయాలని కొడవలూరు మండలం పెమ్మారెడ్డిపాళెం సర్పంచ్ వల్లాపురం నవీన్ కలెక్టర్ హరినారాయణన్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. పెమ్మారెడ్డిపాళేనికి చెందిన కోడూరు విజయకుమార్‌రెడ్డి, పాతవంగల్లు మజరా బొంతలపాళేనికి చెందిన వడ్లమూడి నరేంద్ర పంచాయతీ ఆధీనంలోని సొసైటీ గిడ్డంగికి చెందిన రూ.5 లక్షల కలపను దౌర్జన్యంగా తీసుకుపోయారని ఫిర్యాదు చేశారు. పంచాయతీ పరిధిలో ఉన్న ఫ్లెక్సీలను సైతం ధ్వంసం చేశారని, పంచాయతీ భవనాన్ని ఆక్రమిస్తామంటూ బెదిరిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. జిల్లా ఉన్నతాధికారైన కలెక్టర్ జోక్యం చేసుకుని ప్రభుత్వ ఆస్తులను కాపాడడంతో పాటు తనకు రక్షణ కల్పించాలని కోరారు.

నీట్‌పై చర్చా వేదిక నేడు

నెల్లూరు(అర్బన్): నగరంలోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో మంగళవారం సాయంత్రం 6 గంటలకు నీట్‌పై చర్చా వేదికను నిర్వహించనున్నట్లు జనవిజ్ఞానవేదిక కార్యదర్శి పోతంశెట్టి విద్యాచరణ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైద్య విద్యలో ప్రవేశానికి జాతీయ స్థాయిలో నిర్వహించే నీట్ ఎంట్రెన్స్ టెస్ట్ నిర్వహణలో చోటు చేసుకున్న అవకతవకల నేపథ్యంలో పరీక్షను రద్దు చేయాలా.. వద్దా..అనే అంశంపై చర్చావేదిక నిర్వహిస్తున్నామని చెప్పారు. ఆసక్తి కలిగిన వారు పాల్గొనాలని కోరారు.

27న పది విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

నెల్లూరు(బృందావనం): నగరంలోని మూలాపేట, పత్తేఖాన్‌పేట, మన్సూర్‌నగర్, తదితర ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతిలో ప్రతిభకనబర్చిన విద్యార్థులకు అన్నదేవుల గోవిందురెడ్డి సరస్వతి సమాజం ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాలను ప్రదానం చేయనున్నట్లు ఆ సమాజం అధ్యక్షుడు మోపూరు పెంచలయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27న ఉదయం 10గంటలకు సమాజం ప్రాంగణంలో జరిగే కార్యక్రమంలో విద్యార్థులకు ప్రోత్సాహక నగదు బహుమతులతో పాటు జ్ఞాపిక, ప్రశంసాపత్రాలు అందజేయనున్నట్లు చెప్పారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులను సన్మానించనున్నట్లు తెలిపారు.

పిల్లలందరినీ బడికి పంపాలి



గ్రామంలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

కోవూరు : బడిఈడు పిల్లలందరినీ పాఠశాలలకు పంపాలని ఎంఈఓ చెంచులక్ష్మి అన్నారు. మండల పరిధిలోని గుమ్మలదిబ్బలో ఉన్న పాఠశాల విద్యార్థులతో నేను బడికి పోతా కార్యక్రమంపై సోమవారం ర్యాలీ నిర్వహించారు. పిల్లలు ఉండాల్సింది పనిలో కాదు బడిలో అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థులతో గ్రామంలో ర్యాలీ నిర్వహించి పాఠశాలలకు పంపాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించినట్లు వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎం ఇంద్రావతి, ఉపాధ్యాయులు మల్లికార్జున, జయప్రకాష్, పీడీ మధుసూదన్‌రావు, అజయ్‌కుమార్, వేణుగోపాల్, మారుబోయిన శ్రీనివాసులు, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం నిల్వలపై టీఏలకు శిక్షణ

కొడవలూరు : ధాన్యం, పప్పు దినుసులు పురుగు పట్టకుండా నిల్వ ఉంచడంపై నూతన టీఏలకు మండలంలోని చంద్రశేఖరపురం పౌరసరఫరాల శాఖ గిడ్డంగుల్లో సోమవారం శిక్షణ ఇచ్చారు. పౌర సరఫరాల శాఖ ఇటీవల 11 మంది టెక్నికల్ అసిస్టెంట్‌లను కాంట్రాక్ట్ బేసిక్‌లో నియమించింది. వీరికి ధాన్యం, అపరాలు నిల్వ ఉంచడంపై సంబంధిత అధికారులు శిక్షణ ఇచ్చారు. వారానికోసారి నిర్దేశించిన మందులను ధాన్యం, అపరాల నిల్వలపై స్ప్రే చేయడం ద్వారా పురుగు ఆశించకుండా ఉంటుందని శిక్షణలో టీఏలకు వివరించారు. కార్యక్రమంలో పౌరసరఫరాల శాఖ టెక్నికల్ ఏఎం లక్ష్మీనారాయణ, గిడ్డంగి మేనేజర్ ఎఫ్.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



ధాన్యం, అపరాల నిల్వల రక్షణపై శిక్షణ ఇస్తున్న అధికారులు

వీధిలైట్ల సమస్యకు పరిష్కారం

మనుబోలు : మండలంలోని జట్లకొండూరు గ్రామంలో గత కొన్ని రోజులుగా వీధిలైట్లు వెలగడం లేదని స్థానికులు ఫిర్యాదు చేయడంతో వైఎస్సార్‌సీపీ సర్పంచ్ నాగమ్మ, ఉప సర్పంచ్ తులసీరామ్ సోమవారం కొత్త లైట్లను ఏర్పాటు చేయించారు. పంచాయతీ సిబ్బంది ఏ ఏ స్తంభాలకు లైట్లు వెలగడం లేదో గుర్తించారు. అనంతరం కొత్త లైట్లు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తులసీరాం మాట్లాడుతూ ఎన్నికల్లో గెలుపోటములతో సంబంధం లేకండా పంచాయతీలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ప్రతిపక్షంలో ఉన్నా పంచాయతీలో తమను ఆదరించి గెలిపించిన గ్రామస్తులకు అన్నివిధాలుగా అండగా ఉంటామని పేర్కొన్నారు.



వీధిలైట్లను ఏర్పాటు చేయిస్తున్న ఉపసర్పంచ్ తులసీరాం

మారెమ్మకు పొంగళ్ల సమర్పణ నేడు

తోటపల్లిగూడూరు : మండలంలోని చిన్నచెరుకూరు గ్రామదేవత మారెమ్మ అమ్మవారికి మంగళవారం పొంగళ్ల సమర్పణ కార్యక్రమం జరుగనుంది. గత నెల 28వ తేదీన మారెమ్మ అమ్మవారి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ క్రమంలో మూడు మంగళవారాలు భక్తులు అమ్మవారికి సద్ది సమర్పణ చేశారు. ఈ క్రమంలో ఐదో మంగళవారం పొంగళ్ల సమర్పణ కార్యక్రమాన్ని చేపట్టేందుకు సర్వం సిద్ధం చేస్తున్నారు. మహిళా భక్తులు అధికసంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుంటారు. దీనికి తగినట్లు ఏర్పాట్లు కూడా చేశారు.



ఆలయాన్ని ముస్తాబు చేస్తున్న దృశ్యం

బ్యాంకు సేవలను సరళతరం చేయాలి

నెల్లూరు(అర్బన్): పేదలందరికీ ఫెడరల్ బ్యాంకు సేవలు అందేలా లక్ష్యాలను సరళతరం చేయాలని నెల్లూరు జిల్లా డైరెక్టర్ ట్యాక్స్ బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు కొంజేటి శ్రీనివాసులు అన్నారు. వేదాయపాళెంలోని నిప్పో ఫ్యాక్టరీ సమీపంలో ఫెడరల్ బ్యాంక్ రెండో బ్రాంచ్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కస్టమర్లకు తక్కువ వడ్డీకే రుణాలు అందజేయడంతో పాటు డిపాజిట్లు సేకరించడం, తదితర సేవలు అందించడంలో ఫెడరల్ బ్యాంకు ముందుందన్నారు. బ్యాంకు ఏరియా హెడ్ స్వాతి మాట్లాడుతూ తిరుపతి క్లస్టర్ పరిధిలోని 14వ బ్రాంచ్‌ను వేదాయపాళెంలో ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. విస్తరిస్తున్న నెల్లూరు నగరాన్ని దృష్టిలో ఉంచుకుని రెండో బ్రాంచ్‌ను ఏర్పాటు చేశామని చెప్పారు. త్వరలోనే మూడో బ్రాంచ్ ఏర్పాటు చేస్తామన్నారు. కస్టమర్ల నమ్మకాన్ని కాపాడుతూ బ్యాంకు సేవలను అందిస్తామన్నారు. బ్రాంచ్ మేనేజర్ ప్రవీణ్, భారతి విద్యాభవన్ అసోసియేట్ సెక్రటరీ సుమతిబాలాజీ, తదితరులు పాల్గొన్నారు.



ఫెడరల్ బ్యాంకు నూతన బ్రాంచ్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

వైద్యశాఖ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించండి

నెల్లూరు(అర్బన్): అమరావతిలో ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, వైద్యవిద్యా శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రికి మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. వైద్యశాఖలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మన్నేపల్లి పెంచలరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండారుపల్లి వెంకటేశ్వర్లు, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి గాదిరాజు రామకృష్ణ, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసాలపై జాగ్రత్తగా ఉండాలి

- యూనియన్ బ్యాంక్ చీఫ్ మేనేజర్ ప్రవీణ్‌కుమార్

కొడవలూరు : ప్రతిఒక్కరూ బ్యాంక్ ఖాతాల గురించి అవగాహన కలిగి ఉండాలని, అదేవిధంగా ఆన్‌లైన్ మోసాల పట్ల కూడా జాగ్రత్తగా ఉండాలని యూనియన్ బ్యాంక్ చీఫ్ మేనేజర్ ప్రవీణ్‌కుమార్ సూచించారు. స్థానిక సంఘ బంధం కార్యాలయంలో సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా వచ్చిన ఆయన మాట్లాడుతూ బ్యాంక్ సేవలను ప్రతి ఒక్కరూ విధిగా వినియోగించుకోవాలని, అదేవిధంగా తెలివిగా ఉపయోగించడం నేర్చుకోవాలని చెప్పారు. అనంతరం ట్రైనర్స్ టి.సతీష్, నాయబ్ బాషా, ఎస్కే బాబు మాట్లాడారు. బ్యాంక్ ఖాతా తెరవడం, లావాదేవీల నిర్వహణ, డిపాజిట్ ఖాతాలతో అదనపు ప్రయోజనాలు పొందడం, ఫిర్యాదులు పరిష్కరించుకోవడం, వయో వృద్ధులకు బ్యాంక్‌లో ఉన్న అదనపు సౌకర్యాల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.ఆంజనేయులు, ప్రాజెక్ట్ మేనేజర్ వి.అశోక్‌కుమార్, ఏపీఎం ఎస్.రుక్మిణి, సీసీలు కె.ఉదయ్‌కుమార్, సుకన్య, శ్రీదేవి, మమత, శోభ తదితరులు పాల్గొన్నారు.



బ్యాంక్ లావాదేవీలపై రూపొందించిన పుస్తకాలను ఆవిష్కరిస్తున్న సిబ్బంది